# పందిరి

జీవుడు పంచభూత నిర్మితమైన దేహమునందున్నపుడు ఈ విధానమంతయు ఆచరించవలసి ఉన్నదని తెలుపు నిమిత్తము ఐదు గుంజల పందిరి లోపలనే పెళ్లి జరిపెడివారు. ఇక్కడ నాలుగు గుంజల పందిరేగాని ఐదుగుంజల పందిరెక్కడున్నదని కొందరడుగవచ్చును. దానికి జవాబేమనగా! పంచభూతములనగ ఆకాశము, గాలి, అగ్ని, నీరు, భూమి. వీటిలో అగ్ని, నీరు, భూమి కంటికి కనిపించునట్లుండగ గాలి స్పర్శ ద్వార తెలియుచున్నది. ఆకాశము మాత్రము ప్రత్యేకముగ ఉంటు మిగతావాటివలె తెలియకుండ ఉన్నది. అందువలన కనిపించు నాలుగు గుంజలను నాలుగు దిక్కుల పాతి వాటి ఆధారముతో పైన వేయు పందిరి మధ్య భాగము మాత్రము గోపురమువలె మొన పైకి ఉండునట్లు పూర్వము నిర్మించెడివారు. అప్పటికి భూమి మీద ఆనియుండిన కొనలు నాలుగుకాగ ఐదవకొన పైకి చూపినట్లుండును. పందిరి మధ్యలో పైన ఉన్న మొనకు ఆకాశమని, క్రింద ముందువైపు ఉన్న కుడి ప్రక్క మొనకు గాలి అనియు, ఎడమ ప్రక్క మొనకు అగ్ని అనియు, అట్లే వెనకున్న వాటికి నీరు భూమి అని గుర్తించుకొని గాలి అగ్ని ఒక్కప్రక్క నీరు భూమి ఒక ప్రక్క మధ్యలో ఆకాశమనునట్లు అర్థముతో పందిరి నిర్మించెడివారు. అలా నిర్మించిన పందిరిచుట్టు చూచెడివారికి అర్ధచంద్రాకృతిగ కనిపించెడిది. ఇలాంటి పందిరి ఇప్పుడెవరు వేయడము లేదు. తలంబరములు వరకు పందిరి క్రిందనే అన్ని కార్యములు జరిగిన తర్వాత ఒక అరుంధతి నక్షత్ర దర్శనమునకు మాత్రమే పందిరి బయటికి వచ్చేవారు. అంతటితో పెళ్లి అయినట్లు భావము అనగా మోక్షము పొందినట్లు. మోక్షము పొందిన వారికి తిరిగి జన్మలేదు. కావున పెళ్లి పందిరి క్రిందనుండి బయటికి వచ్చిన తర్వాత వధూవరులు పందిరి క్రిందకు పోయెడివారు కాదు. అంతటితో పెళ్లి కార్యము భావయుక్తముగా ముగిసినట్లగును.

పూర్వము పెళ్లి ఇందువుల సాంప్రదాయమై దేశమంతా వ్యాపించి ఉండెడిది. ఇందువులనగ జ్ఞానులని అర్థము. పూర్వమిది జ్ఞానుల దేశమైనందువలన ఇందూదేశమనెడి పేరు కల్గినది. కాలక్రమేపి **ఆలిబొట్టు తాళిబొట్టయినట్లు** అజ్ఞానము పెరిగి పోయి ఇందూదేశము హిందూ దేశమైనది. మనము హిందువులుగ మారిన, మరి కొందరు ఇతర మతముల వారుగ మారిన అందరిలోను ఇందూసాంప్రదాయములు ఇప్పటికి కొద్దో గొప్పో మిగిలి ఉండడము చూస్తే ధర్మములు ఇంకనూ కొన ఊపిరితో బ్రతికి ఉన్నవనుటకు నిదర్శనము. ఇప్పటికైన దైవజ్ఞానము తెలిసినవారమై నిర్బలముగ ఉన్న ధర్మములను భావయుక్త ఆచరణలతో తిరిగి కోలుకొనునట్లు చేస్తాము. ధర్మములు ఎప్పటికీ నశించవు. ధర్మములకు గ్లాని మాత్రము కాలక్రమమున ఏర్పడుచుండును. అవి తిరిగి పునరుద్ధరింపబడుతాయి.